క్లుప్తంగా

మడిగెల నిర్మాణానికి భూమి పూజ



బాన్సువాడ: పట్టణంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద మడిగెల నిర్మాణం కోసం శనివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ భూమి పూజ చేశారు. మడిగెల నిర్మాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.8 లక్షలు మంజూరు చేశారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, నార్ల ఉదయ్, నాయకులు అంజిరెడ్డి, పాత బాలకృష్ణ, నాగులగామ మురళీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సదాశివనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యం అని జెడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ సాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు మండలంలోని కుప్రియాల్‌లో రైతు సేవా సంఘం భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు భూంరెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, సాయాగౌడ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



పిట్లం: మండలంలోని గౌరారం గ్రామంలో వైద్య సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపూర్ హెల్త్ సబ్ సెంటర్ అధికారి రాజు మాట్లాడుతూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నేహ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇఫ్తార్ విందు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని దేవునిపల్లి వాసవీ కాలనీలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసం నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు ఉపవాస దీక్షలు పాటిస్తున్నారని ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మక్క, సారలమ్మ వీధినాటక ప్రదర్శన ఆకట్టుకుంటోంది. నాటక ప్రదర్శన శనివారం ముగిసినట్లు సర్పంచ్ బోనాల సుభాష్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అక్బర్ తెలిపారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని బిక్కనూర్ గ్రామంలో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు. స్థానిక మల్లారెడ్డి చెరువులో 57 మందికి వృత్తి నైపుణ్య పరీక్షలను నిర్వహించగా 40 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వసూలు లక్ష్యం ప్రశ్నార్థకం

- ముస్సిపల్ అధికారుల ప్రత్యేక దృష్టి
- ఈ నెల ఆఖరులోగా మొత్తం పన్ను వసూలుకు కార్యాచరణ



బాన్సువాడలో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది



బాన్సువాడ : ఆస్తి పన్ను వసూలుకు బాన్సువాడ మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.78 కోట్ల పన్నులు ఈ నెలాఖరులోగా వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా వసూలు కష్టంగా మారింది. మున్సిపాలిటీలో 8,555 గృహాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 65 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. మిగిలిన పన్నులు ఈనెలాఖరులోగా వసూలు చేయడం కష్టతరంగా మారిందని కొందరు సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కమర్షియల్ భవనాలకు సంబంధించి పన్నుల కోసం మరో బృందాన్ని నియమించారు. ప్రతి నెల కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉండడంతో పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించారు. కమర్షియల్ రంగం నుంచి ఆశించిన మేరకు పన్నులు వసూలు కావడం లేదు. బాన్సువాడ పట్టణంలో దాదాపు 44 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో మెజార్టీ ప్రభుత్వ కార్యాలయాలు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. ఏడాది క్రితమే ఆస్తి పన్ను చెల్లించాలని ప్రభుత్వ కార్యాలయాలకు నోటీలు జారీ చేశారు. ప్రతి ఏటా మార్చి నెలాఖరు లోగా ప్రతి కార్యాలయానికి సంబంధించి పన్నులు చెల్లించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రూ. 63 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

వంద శాతం వసూలు చేస్తాం

ఈ ఏడాది బల్దియా పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేస్తాం. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేశాం. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎక్కువగా ఉన్నాయి.

రమేష్ కమిషనర్ బాన్సువాడ

గ్రామస్థాయిలో వైద్య సేవలు



దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పిట్లం: గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని మద్దెల్‌చెరువు గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకం ద్వారా రూ.16 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ప్రారంభించారు. అదేవిధంగా రాంపూర్‌లో సహకార సంఘం కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం పలువురి లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కుర్ది గ్రామంలో ముదిరాజ్ కమిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, సెకండ్ ఏఎన్ఎంలకు రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, డాక్టర్ శివకుమార్, రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణ కోసం అగచాట్లు



పంట చుట్టూ కట్టిన పాత చీరలు

తాడ్వాయి: అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు పాత చీరలను పొలం చుట్టూ కట్టారు. మొక్కజొన్న, సోయ, చెరుకు, వరి, జొన్న తదితర పంటలను జంతువులు గుంపులుగా వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. పంట దిగుబడి వచ్చే సమయంలో జంతువులు పొలంలో పడి నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

పిట్లం: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే హన్మంత్‌సింధేతో కలిసి పిట్లంలో రూ. 60 లక్షలతో నిర్మించనున్న సహకార సంఘ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులు పండించిన పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందన్నారు. అదేవిధంగా ఆరోగ్యలక్ష్మీ పథకం, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమ, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబాకర్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం కేసీఆర్ అందరి మన్ననలను పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా కుస్తీ పోటీలు



లింగంపేటలో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరా హోరీగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లారం సాయన్న, అశోక్, శ్రీకాంత్, ముదాం సాయిలు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాన్సువాడ మండలంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి వెండి కడియాలు బహూకరించారు.

చిరుధాన్యాలతో వండిన ఆహారం తినాలి



ఫరీద్‌పేటలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

మాచారెడ్డి: మండలంలోని ఫరీద్ పేటలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక అంగన్‌వాడి కేంద్రం టీచర్ లక్ష్మీ చిరు ధాన్యాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలతో వండిన ఆహారం తింటే అనారోగ్య సమస్యలు దూరం అవుతాయన్నారు.

వ్యాసరచన పోటీలు

పిట్లం: తక్కువ ఖర్చుతో దొరికే పోషకాలపై మండలంలోని గౌరారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అంగన్‌వాడి టీచర్ మంగమ్మ బహుమతులు అందజేశారు.

ఎల్లారెడ్డిరూరల్: వేసవిలో తేలికైన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడి టీచర్ దేవకర్ణ గండిమాసానిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూచించారు.

నిజాంసాగర్: మండలంలోని ఆరేడ్ గ్రామ అంగన్‌వాడి కేంద్రంలో చిరుధాన్యాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం భావన, అంగన్‌వాడి టీచర్ ప్రేమల, పంచాయతీ కార్యదర్శి అంజయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం



గుండారంలో జెండా ఊపి ఎన్‌ఎస్‌ఎస్ ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మణ్‌రావు

నిజామాబాద్ సిటీ: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో పాల్గొనే విద్యార్థుల సేవలు అభినందనీయం అని నిజామాబాద్ రూరల్ మండలం గుండారం సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో వారు జెండా ఊపి ఎన్ఎస్ఎస్ ర్యాలీని ప్రారంభించారు. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం కుమారస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండలంలోని సితరాంపల్లి, మాన్యాపూర్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టనున్న ఎన్ఎస్ఎస్ శిబిరానికి కోఆర్డినేటర్ చంద్రశేఖర్ విద్యార్థులకు, స్థానికులు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచులు గంగారెడ్డి, రాములు, ఎన్ఎస్ఎస్ అధికారులు సంజీవ్ రెడ్డి, షోయబ్, మనోజ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు అవార్డుల ప్రదానం

సాక్షి, నెట్‌వర్క్: దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కింద ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ చేతుల మీదు గా అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, డీపీవో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, జెడ్పీ చైర్మన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజంపేట సర్పంచ్ ఆముద సౌమ్య



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శివాయిపల్లి సర్పంచ్ విఠల్‌రెడ్డి



బీబీపేట మండలం మల్కాపూర్ సర్పంచ్..



భిక్కనూరు మండలం గుర్జకుంట, రామేశ్వర్‌పల్లి సర్పంచ్‌లు..



దోమకొండ మండలంలో..



లింగంపేట మండలంలో..



బిచ్కుంద మండలంలో..



తాడ్వాయిలో



నిజాంసాగర్ మండల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు..

ఆధ్యాత్మికం

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



రామారెడ్డి: ప్రముఖ శ్రీ సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం ఆవిష్కరించారు. 30న కల్యాణోత్సవం, వచ్చే నెల ఒకటో తేదీన గరుడసేవ, 3న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, 5న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఉస్కె సాయిలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ సుంకోజీ గంగాధర్, ఆకుల ఉమాపతి, పడిగెల శ్రీనివాస్, కడెం శ్రీకాంత్, మహిపాల్, రుచి రాజిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లి గ్రామంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించనున్నట్లు సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావులు తెలిపారు. 26న హోమం, 27న అభిషేకాలు, 28న పూర్ణాహుతి హోమం, కల్యాణం నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

వెండి తొడుగు కోసం ఆర్థిక సహాయం



బాన్సువాడ : పట్టణంలోని పాత బాన్సువాడ హనుమాన్ ఆలయంలో ఉన్న విగ్రహానికి వెండి తొడుగు కోసం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా రెండు కిలోల వెండి కోసం సహాయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, పాత బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన పీఠాధిపతి

నిజాంసాగర్: మండలంలోని జక్కాపూర్ గ్రామ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని నాచారంత పీఠాధిపతి మధుసూనంద స్వామి దర్శించుకున్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపన, మూలవిరాట్‌కు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. గౌడ సంఘం నాయకులు జగన్‌గౌడ్, అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రథోత్సవం

నాగిరెడ్డిపేట: మండలకేంద్రం గోపాల్‌పేటలో శనివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

లింగంపేట: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. రథాన్ని ఆలయం చుట్టూ ప్రదర్శించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షిప్తం

రెడ్డి సంక్షేమ సంఘం భవనానికి విరాళాలు

భిక్కనూరు: మండల రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి అంతంపల్లికి చెందిన భూపాల్‌రెడ్డి, వలకొండ వెంకట్ రెడ్డి, చిట్టెడి మధుమోహన్‌రెడ్డి విరాళాలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు జంగం శ్రీశైలం పాల్గొన్నారు

సామూహిక సీమంతాలు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. అదేవిధంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కోదురి సాయగౌడ్, మంజుల, విండో చైర్మన్ రాజాగౌడ్, అంగన్‌వాడి టీచర్లు జ్యోతి, రాణి, సవిత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తైబజార్ వేలం

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని రోజువారీ, వారాంతపు, పశువుల దాఖలాలకు సంబంధించిన తైబజార్ వేలం పాట ముగిసినట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు.

బోరుబావి తవ్వకం

రాజంపేట: మండల కేంద్రంలోని డైలీ మార్కెట్‌లో బోరు బావి తవ్వకం పనులను ఎంపీపీ లింగాల స్వరూప ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండహన్మండ్లు, కోఆప్షన్ సభ్యులు హైమద్‌అలీ, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, నాగరాజు, రవికుమార్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మద్నూర్: ఇష్టపడి చదివితే ఫలితం ఉంటుందని మొగ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శివప్రభ పేర్కొన్నారు. డోంగ్లీ మండలం మొగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు.

చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే హన్మంత్ సింధే పంపిణీ చేశారు.

మసీదుల మరమ్మతులకు నిధులు మంజూరు

కామారెడ్డి టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని పలు మసీదుల మరమ్మతుల కోసం రూ. 18 లక్షల చెక్కును అందజేసినట్లు విప్ గంపగోవర్ధన్ తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల రక్తదానం

లింగంపేట/ సదాశివనగర్/ ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట: ఎమ్మెల్యే జాజాల సురేందర్ పుట్టిన రోజు సందర్భంగా పలుచోట్ల బీఆర్‌ఎస్ నాయకులు రక్తదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే సురేందర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

బీబీపేట: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నక్క రవీందర్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కారణంగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బాధ్యులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు అల్లం ప్రవీణ్, శివకుమార్, తాళ్ల దేవరాజ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.